అడల్ట్స్ ఓన్లీ కథ

# చెక్

కర్లపాలెం హనుమంతరావు

"నీకు చెస్ ఆడటం వచ్చా?" విస్కీలో సోడా కలుపుకుంటూ అడిగాడు వాసుదేవరావు.

"ఏదో సార్ కొద్దిగా... కాలేజీ రోజుల్లో ఆడేదాన్ని" అంది పల్లవి కోక్‌లో సోడా కలుపుకుంటూ.

రాత్రి తొమ్మిది దాటింది.


బైట చలిగా ఉన్నా రూమ్‌ఫైర్ ఉండటం వల్ల గది వెచ్చగానే ఉంది. అది వాసుదేవ రావు కంపెనీ గెస్ట్ హావుస్‌లోని అతని ప్రత్యేకమైన గది. కంపెనీ పనిమీద బెంగుళూరు వస్తూ... తోడుగా పర్సనల్ అసిస్టెంట్ పల్లవిని కూడా తీసుకొచ్చాడు వాసు. పని పూర్తయ్యే సమయానికి లాస్ట్ ఫ్లయిట్ వెళ్లిపోయింది. మళ్లీ తెల్లారి ఫస్ట్ ఫ్లయిట్‌కే ప్రయాణం.

వాసుదేవరావుకి ఉత్సాహంగా ఉంది. పల్లవిని ట్రాప్‌లో వేయటానికిదే మంచి ఛాన్స్... అందుకే ఈ 'చెస్' ప్రస్తావన.

పల్లవికి పాతికేళ్లుంటాయి. చక్కగా ఉంటుంది. ఇంకా పెళ్లి కాలేదు. మిడిల్ క్లాస్ వాళ్లకుండే అన్ని ఈతి బాధలూ ఈమెకూ ఉన్నాయి. వాసుదేవరావుకివన్నీ తెలుసు. అవీ ఇవీ ఇచ్చి ఆమెను పడేయాలని చూశాడింతవరకూ. దేనికీ లొంగే ఘటం కాదామె. అందుకే మరీ మోజు ఎక్కువయిపోయింది. ఆ పిల్లనెలాగైనా నొప్పించకుండా ఒప్పించుకోవాలని బాసు ఆలోచన.

వాసుదేవరావుకు ఆ ఒక్క పిచ్చి తప్పిస్తే పక్కా జంటిల్‌మాన్. "వేరే వాళ్ల దగ్గర మాత్రం ఇంతకన్నా భద్రత ఉంటుందని భరోసా ఏంటీ?... ఇక్కడే ఏదో వదుపుగా ఉంటే సరి.. తెలీని గందరగోళం కన్నా... తెలిసిన ఈ మేళమే బెటరని" సర్దుకుపోతూ వస్తూ ఉంది పల్లవి.

"ఫ్లైటెప్పుడో తెల్లారుఝామున... అప్పటిదాకా నిద్ర పట్టేట్లు లేదు.. పోనీ కాసేపు 'చెస్' ఆడుదామా పల్లవీ!... సరదాగా..." అని ప్రపోజ్ చేశాడు వాసుదేవరావు.



వాసుదేవరావుకి 'చెస్'లో మంచి ప్రావీణ్యముంది. చికాగ్గా ఉన్నప్పుడో... హుషారుగా ఉన్నప్పుడో ఒక్కడే కూర్చుని ఎత్తులు వేసుకుంటూ ఉంటాడు. అందుకే అతని దగ్గర ఎప్పుడూ ఓ చెస్ బోర్డూ.. కాయలూ ఉంటూంటాయి. ఆ సంగతి పల్లవికి తెలుసు.

బ్యాగులో నుండి బోర్డు తీసి కాయల్ని బల్లమీద సర్దుతూ ఉంది పల్లవి.

"పందెం ఏమిటి?" అనడిగాడు బాసు.

"పందెమేమీ వద్దులే సార్... అయినా మీతో నాకు పందేలేమిటి... సిల్లీగా..." అంది పల్లవి

కొద్దిగా సిగ్గుపడుతూ.

"పందెం లేకపోతే ఏ ఆటా పసందుగా ఉండదు పల్లవీ!...జస్ట్ ఫర్ ఫన్ సేక్.. ఏదో ఒకటి ఉండాలి"

"సరే.. అదేంటో కూడా మీరే చెప్పండి!" అంది తన వైపు నల్లకాయలు తిప్పుకుంటూ.

"నువ్వు గెలిస్తే నీకిప్పుడే ప్రమోషన్ ఆర్డర్స్ చేతిలో పెడతా"

"మరి నేను ఓడిపోతే?"

"ఏమీలేదు" అన్నాడు వాసుదేవరావు.

హర్టయినట్లు చూసింది పల్లవి. "అదేం బాగుంటుంది...! ఏదో ఒకటి చిన్నదైనా సరే చెప్పండి సార్!" అంది. ఆ ఆత్మాభిమానమే బాగా నచ్చుతుంది వాసుదేవరావుకి. నిదానంగా అన్నాడు...

"సరే నువ్వంతగా ఫీలవుతున్నావు గనక.... ఒక పని చేద్దాం.. నేను చెక్ చెప్పినప్పుడల్లా వెనక్కి తీసుకోటానికి ఓ 'కిస్' తీసుకుంటాను. నువ్వు 'చెక్' చెప్పి వెనక్కి తీసుకుంటే ఒక వెయ్యి రూపాయలు ఇచ్చుకుంటాను. మూడుసార్లకు మించి ఇద్దరికీ ఛాన్సు లేదు... ఓకేనా?"

పల్లవి సైలెంటయిపోయింది.

"పోనీలే... నీకంత ఇదిగా ఉంటే.. ఆట వద్దులే.. నీ రూముకి పోయి హాయిగా పడుకో.. సరిగ్గా తెల్లారి ఐదింటికి లేపు... చాలు" అని ఆవులిస్తూ లేవబోయిన బాసుని ఆపేసింది పల్లవి.

"సరే సార్!... ఈ ప్రమోషన్లూ.. మనీ రెండూ నాకూ, నా ఫ్యామిలీకి చాలా అవసరం" అంది పల్లవి.

"గెలుపు ఓటములు దైవాధీనములు" అంటూ సిసీలియన్ ఓపెనింగ్ వేశాడు వాసుదేవరావు. ఆట నడుస్తూ ఉంది.

పల్లవి తొందర తొందరగా బలాలు పోగొట్టుకుంటూ ఉంది. వాసుదేవరావుకి ఉత్సాహంగా ఉంది. ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న అవకాశం.. ఏపిల్ పండు లాంటి పిల్ల పక్కలోకి రాబోతుంది.

ఐదు నిమిషాలు కాకుండానే 'చెక్' అన్నాడు బాసు.

పల్లవి సిగ్గుపడుతూ "ప్లీజ్.. విత్‌డ్రా సర్!" అనడిగింది మురిపెంగా "మరి కిస్?"

"ఫస్ట్ టైం కదా... చేతి మీద తీసుకోండి" అంది ప్లీజింగ్‌గా.

తామరతూడు లాంటి ఆమె చేతినందుకుని 'కిస్' ఇస్తుంటే ఆ 'టచింగ్'కి ఎక్కడికో వెళ్లిపోయింది వాసుదేవరావు మనసు. 'చేతిమీదే ఇంత రంజుగా ఉంటే... చెంపమీదా... లిప్స్ మీదా ఇంకెలాగుంటుందో...' వాసుదేవరావు గుండెలు గుబగుబలాడాయి.

బాసు చెక్ వెనక్కు తీసుకోవటంతో ఆట ముందుకు సాగటం మొదలుపెట్టింది. పల్లవి ఈసారి వడుపుగా తప్పించుకుంటూ ఉంది. రెండవసారి 'చెక్' చెప్పటానికి పది నిమిషాలకు పైనే పట్టింది.

"వెనక్కి తీసుకోనా?" అనడిగాడు వాసు బాసు కొంటెగా చూస్తూ.

"తప్పేదేముంది" అంది పల్లవి తలెత్తకుండానే చేయి ముందుకు చాపి.

"నో... పునరుక్త దోషం పనికిరాదు. ఈసారి..." అంటూ చెంపలు చూపించాడు చిలిపిగా.

"మరి.. మూడోసారయితే?..." అనడిగింది పల్లవి భయంగా.

"అన్నిసార్లూ నేనే చెక్ చెప్పాలనేముంది పల్లవీ?... చూస్తున్నాగా... యువారాల్సో ఏ గుడ్ ప్లేయర్" అన్నాడు బాసు పల్లవి బెదిరిపోకుండా.ఒక్క క్షణం ఆగి నిదానంగా అంది పల్లవి. "ఒక చిన్న ఎడ్జస్టుమెంటు సార్.. ఈసారిదీ... అయితేగియితే మూడోసారిదీ.. ఒక్కసారే తీసుకోండి సార్..ప్లీజ్!"

"వై?!"

"నేను మీ లాంటి గ్రాండ్‌మాస్టర్ని కాదు. ఆడపిల్లను ఫస్టు కిస్‌కే బాగా డిస్టర్బయ్యాను. ఇప్పుడే అంటే ఈ మాత్రం కూడా ఆడలేను" ప్లీజ్... కన్‌సిడర్ సర్!"

వాసుదేవరావు ఆలోచనలో పడ్డాడు. ఈ ప్రపోజలూ బాగానే ఉంది. బిట్స్ బిట్స్‌గా కిస్సులిచ్చే కన్నా ఒక్కసారే పక్కనా, పైనా ఇచ్చేస్తే నెక్స్ట్ మూమెంట్‌లో ఆమె ఫ్లాటయిపోవటం ఖాయం. తన పని అనుకున్న దాని కన్నా మరింత సులువయిపోతుండటంతో సంతోషంగా ఒప్పుకుని మంత్రిని వెనక్కు తీసుకుని మరో ఎత్తు వేసి ఆమె ముందుకు ఆడటానికి దారి ఇచ్చాడు.

మూడోసారి కూడా చెక్ అనేసి ఎప్పుడెప్పుడు ఆమెను ఆక్రమించుకుందామా అని ఆత్రంగా ఉంది వాసుదేవరావు మనసు. ఎటు నుంచీ వస్తున్నా ఆ పిల్ల వడుపుగా తప్పుకుంటూ ఉంది. నడక తడబడుతోంది. 'ఈ పిల్ల దగ్గర ఇంత ఆట ఉందని తెలీదే!.. తెలిసుంటే ఇలా ఈ ప్రమోషన్ తాయిలం చూపించే వాడు కాదే...' ప్రమోషన్ ఇవ్వాల్సి వస్తున్నందుకు కాదు వాసుదేవరావు బాధ... ఇక ముందు ప్రమోషన్ పేరుతో ఆమెను బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉండదేమోనని.

'ఎలాగైనా సరే... మూడోసారి ఆమె రాజుని దిగ్బంధం చేసి ఆమెను తన కౌగిల్లో బంధించాల్సిందే' వాసుదేవరావు సర్వశక్తులూ వొడ్డి కసిగా పావులు కదుపుతూ ఉన్నాడు. పల్లవి తదేకంగా బోర్డు వంకే చూస్తూ ఆడుతూ ఉంది. డిఫెన్సులో పడిపోయాడు బాసు.

చచ్చేటంత ఉక్రోషం వచ్చిందతనికి. పెదాల దాకా వచ్చిన ముద్దులు మిస్సయిపోతున్నాయేమోనని నిస్పృహ మొదలయింది. అందుకొనేటంత దగ్గరగా వచ్చిన అందం అందకుండా దూరంగా పోతుందేమోనన్న దుగ్ధ... అతని మనసుని నిలవనీయటం లేదు. ఆ వత్తిడికి తను తట్టుకునేటందుకు తంటాలు పడుతున్నాడు.. 'చెక్' అందామె!

వాసుదేవరావు కళ్లు బైర్లుకమ్మాయి. తన రంధిలో తనుండగా పల్లవి తన రాజును గోతిలో దింపేసింది! తప్పించుకునే దారి ఏమాత్రం లేదు. వెయ్యి రూపాయలిచ్చి వెనక్కి తీసుకోమని చులకన అయ్యే కన్నా... ఆ ప్రమోషనేదో పారేస్తే పరువన్నా నిలబడుతుంది. తరువాతైనా తనింతకన్నా మెరుగ్గా ఆడగలనన్న ధైర్యం పోయింది. పూర్తిగా డిస్టర్బయి పోయిన కండిషన్లో పల్లవి ప్రమోషన్ ఆర్డర్స్ మీద వణికే చేతుల్తో సంతకం చేశాడు వాసుదేవరావు.

☆ ☆ ☆

"మన బాస్ చెస్‌లో మాస్టర్ కదా.. నీకేమో అంత బాగా రాదంటావు. అయినా అంత ధైర్యంగా పందెం ఎలా కాశావే?... అందులోనూ ఇలాంటిది...?!" అనడిగింది వనజ ఆ మర్నాడాఫీసులో.

"నాకు చెస్ అంతగా తెలీని మాట నిజమేనే... కానీ మగాడి నైజం బాగా తెలుసే. అందుకే ఇబ్బందనిపించినా మొదటిసారి చేతి మీద ముద్దు పెట్టుకోనిచ్చాను" అంది పల్లవి చిలిపిగా నవ్వుతూ. ☆

## కోటి క్లబ్‌లో అనుష్క?

కోటి రూపాయలు డిమాండ్ చేసిన తారగా సంచలనం సృష్టించింది ఇలియానా. ఇప్పుడు మరో తార కూడా కోటి రూపాయల్ని డిమాండ్ చేస్తోందిట. ఆమె ఎవరో కాదు... అనుష్క! తన అందచందాలతో కుర్రప్రేక్షకుల్ని ఉర్రూతలూగించే అనుష్క నేడు టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్. ప్రభాస్ హీరోగా తమిళ సినిమా 'బిల్లా' ఆధారంగా నిర్మించే తెలుగు వెర్షన్‌లో హీరోయిన్‌గా నటించడానికి అనుష్క అందుకుంటున్న మొత్తం కోటిరూపాయలట. తమిళ చిత్రంలో ఇదే పాత్రను పోషించిన నయనతార బికినీలో కనిపించి సంచలనం సృష్టించింది. మరి తెలుగులోనూ ఆ సీన్ వుంటుందా?

